సాక్షి
ఖమ్మం

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



ఆమే అధికం !

'పరిషత్' ఎన్నికలకు ఓటర్ల తుది జాబితా విడుదల చేయగా పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. 8లో



'బంకర్' తొలగించాలని దీక్షలు

సత్తుపల్లిలోని సైలో బంకర్ ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నందున తొలగించాలనే డిమాండ్‌తో స్థానికులు దీక్షలు చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం మంచు ప్రభావం కనిపిస్తుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరిగే అవకాశముంది.

మిర్చి బస్తాలతో నిండిన ఖమ్మం మార్కెట్‌లో యార్డులు, షెడ్లు



ఎక్కడికక్కడ మిర్చి కొనుగోళ్లు

అక్షరాలా.. లక్ష బస్తాలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి పోటెత్తింది. 'తేజా' రకం మిర్చి కొనుగోళ్లలో ఖమ్మం మార్కెట్‌కు పేరు ఉండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల నుంచి కూడా రైతులు పంట తీసుకొచ్చారు. ఆదివారం సాయంత్రం నుంచే ఖమ్మం మార్కెట్‌కు మిర్చి వాహనాలు వస్తుండగా సోమవారం ఉదయానికి బారులు దీరాయి. యార్డుతో పాటు షెడ్లు కూడా మిర్చి బస్తాలతో నిండిపోయాయి. మొత్తం లక్ష బస్తాల మిర్చి వచ్చినట్లు వెల్లడించగా.. ఉదయం 7–30 గంటలకు జెండా పాట నిర్వహించారు. గరిష్టంగా రూ.14 వేలుగా పాడినా ఎక్కువ సరుకును రూ.13 వేల నుంచి రూ.13,500తోనే కొనుగోలు చేశారు. మోడల్ ధర రూ.13,300గా, కనిష్ఠ ధర రూ.6 వేలుగా నమోదైంది. అయితే, మిర్చి వికయాలు పెరుగుతున్నా ధరలో పురోగతి లేకపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది.

నేడు పత్తి యార్డులోనూ...

ఖమ్మం మార్కెట్‌లోని పత్తి యార్డులో సైతం మంగళవారం మిర్చి విక్రయాలు జరగనున్నాయి. మిర్చి యార్డు సోమవారం నిండిపోవడంతో రాత్రి వరకు కాంటాలు ముగిసినా తరలింపు మాత్రం పూర్తవలేదు. దీంతో సోమవారం రాత్రి నుంచి మార్కెట్‌కు తీసుకొస్తున్న మిర్చి బస్తాలను పత్తి యార్డుకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌పై భారం పడకుండా కార్యాచరణ

- త్వరలోనే అందుబాటులోకి మద్దులపల్లి మార్కెట్
- వైరా, ఏన్కూరు, నేలకొండపల్లి, మధిరపైనా దృష్టి



మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న షెడ్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇంకో వారం, పది రోజులు దాటితే రోజుకు లక్ష బస్తాలపైన మిర్చి వచ్చే అవకాశముంది. ఈనేపథ్యాన ఖమ్మం మార్కెట్‌పై ఒత్తిడి తగ్గించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో ఖమ్మం మార్కెట్ పరిధి నుంచి విడిపోయి ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో మార్కెట్ ఏర్పాటుచేయగా అక్కడ షెడ్లు, భవనాలు సిద్ధమయ్యాయి. ఈ మార్కెట్‌తో పాటు వైరా, ఏన్కూరు, మధిర, నేలకొండపల్లి మార్కెట్ యార్డుల్లోనూ మిర్చి కొనుగోళ్లు చేపడితే రైతులంతా ఖమ్మం రాకుండా నిలువరించవచ్చని, తద్వారా భారం తగ్గుతుందని భావిస్తున్నారు.

మిర్చి కొనుగోళ్లకు ప్రత్యేకం

రాష్ట్రంలోనే మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ప్రత్యేకత ఉంది. ఈ మార్కెట్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ ఎగుమతులు చేసే వ్యాపారులు కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇక్కడ పండించే 'తేజా' రకం మిర్చికి విదేశాల్లో డిమాండ్ ఉండగా, ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచే కాక ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు కూడా తీసుకొస్తున్నారు. మంచి ధర వస్తుందనే నమ్మకంతో రైతులు బారులు దీరుతుండగా ప్రభుత్వం, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

సిద్ధంగా మద్దులపల్లి మార్కెట్

ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలోని 24 ఎకరాల్లో రూ.19.50 కోట్ల వ్యయంతో చేపట్టిన మార్కెట్ నిర్మాణాలు చివరి దశకు చేరాయి. ఇప్పటికే మార్కెట్ కార్యాలయం, పరిపాలనా విభాగం కార్యాలయాలు సిద్ధమయ్యాయి. అలాగే, 17 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగిన రెండు కవర్ షెడ్లు, 8,600 చ. అడుగులతో మరో షెడ్, 17 వేల చ. అడుగులతో రెండు ప్లాట్‌ఫాంల నిర్మాణం పూర్తయింది. వే బ్రిడ్జి నిర్మాణం, అంతర్గత రోడ్ల పనులు చివరి దశలో ఉండగా, క్రయవిక్రయాలకు అడ్తీదారులు, దడవాయిలు, కార్మికులను నియమించి లైసెన్సులు జారీ చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన అధికారికంగా ప్రారంభోత్సవాలు లేకుండానే మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని సన్నాహాలు చేస్తున్నారు.

మార్కెట్లను సందర్శించిన జేడీ

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు సోమవారం జిల్లాలోని మద్దులపల్లి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లను సందర్శించారు. మద్దులపల్లిలో పూర్తయిన పనులు, ఖమ్మం మార్కెట్‌లో రూ.155.35కోట్లతో చేపడుతున్న మిర్చి యార్డు పనులను పరిశీలించారు. అలాగే, ఖమ్మం మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలపై ఆరా తీసిన ఆయన ప్రత్యామ్నాయంగా మద్దులపల్లి, మధిర, వైరా, ఏన్కూరు, నేలకొండపల్లి మార్కెట్లలోనూ కొనుగోళ్లకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

మండలి కోలాహలం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ముగిసిన నామినేషన్లు
- ఉపసంహరణ అనంతరం 13న అభ్యర్థుల ఖరారు
- ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు
- ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. సోమవారంతో నామినేషన్ల గడువు ముగియగా, 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 13న ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో మిగిలిన అభ్యర్థుల సంఖ్య తేలనుంది. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నం కాగా, ప్రధాన పార్టీల నాయకులు సైతం సంఘాల వారీగా అభ్యర్థులకు మద్దతు ప్రకటించి వారి విజయానికి వ్యూహాలు రచిస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల గడువు ముగిసిన నేపథ్యాన ప్రచారం మరింత జోరందుకోనుంది.

అలుగుబెల్లి పదవీకాలం ముగియడంతో..

2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానం నుంచి వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. రెండో స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పూల రవీందర్ నిలిచారు. ప్రస్తుతం నర్సిరెడ్డి పదవీ కాలం ముగియడంతో గతనెల 29న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఎన్నికకు సంబంధించి నల్లగొండలో ఈనెల 3 నుంచి సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈనెల 11న పరిశీలన, 13న ఉపసంహరణ ఉండగా, 27న పోలింగ్ నిర్వహిస్తారు. వచ్చే నెల 3న ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. కాగా, ఖమ్మం జిల్లాలో 4,089 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,022 మంది ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు ఉన్నారు. ఇక రెండు జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా, మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో డిసెంబర్ 30న ప్రకటించిన జాబితా ప్రకారం 24,905 మంది ఓటర్లు ఉండగా, ఆ తర్వాత కూడా నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో మరో 892 మంది నమోదు చేసుకోగా సోమవారం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 25,797 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.

పోటాపోటీగా నమోదు..

బరిలో నిలవాలనుకున్న ఆశావహులు పోటాపోటీగా ఉపాధ్యాయులతో ఓటర్లుగా నమోదు చేయించారు. ఈ మేరకు 23 మంది 50 సెట్ల నామినేషన్లు సమర్పించగా, ప్రధాన సంఘాల అభ్యర్థులు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేపట్టారు. పట్టణాల్లో సమావేశాలు నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. తమను గెలిపిస్తే విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామని హామీలు గుప్పిస్తున్నారు. ప్రధాన సంఘాల నుంచే కాక స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలో ఉండడంతో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రచారపర్వం మరింత వేడెక్కనుంది.

పార్టీల మద్దతుతో..

గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగేవి. సంఘాల వారీగా అభ్యర్థులకు రాజకీయ పార్టీలు అంతర్గతంగా మద్దతు ఇచ్చేవి. కానీ ఇప్పుడు పలువురు అభ్యర్థులకు రాజకీయ పార్టీలు బహిరంగంగానే మద్దతు ప్రకటించాయి. టీపీయూఎస్ మద్దతుతో బరిలో నిలుస్తున్న పులి సరోత్తమ్‌రెడ్డికి బీజేపీ మద్దతు ప్రకటించడంతో పాటు ఆ పార్టీ నేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మద్దతుపై కాంగ్రెస్ ఇప్పటివరకైతే ప్రకటన చేయకున్నా ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. మరోపక్క ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ వెల్లడించింది.

మరోసారి బరిలో..

ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి గతంలో పోటీ చేసి విజయం సాధించిన, ఓటమి చెందిన వారంతా మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన అలుగుబెల్లి నర్సిరెడ్డి టీఎస్ యూటీఎఫ్ నుంచి పోటీ చేస్తుండగా టీపీటీఎఫ్‌తోపాటు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. పీఆర్‌టీయూ టీఎస్ నుంచి పింగిలి శ్రీపాల్, టీపీయూఎస్ నుంచి బరిలో నిలుస్తున్న పులి సరోత్తమ్‌రెడ్డికి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. అలాగే మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.సుందర్‌రాజు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో కొందరు, పలువురు స్వతంత్రులు పోటీకి దిగుతున్నారు.

న్యూస్‌రీల్

వారబందీ విధానంలో సాగునీరు

వైరా: వైరా రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు వారబందీ విధానంలో సాగునీరు విడుదల చేయనున్నట్లు ఐబీ డీఈ శ్రీనివాస్ చేశారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల 13 నుంచి ఏప్రిల్ 11వరకు వారం పాటు సరఫరా, వారం నిలిపివేస్తామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పటికీ రైతుల అవసరాల దృష్ట్యా విడుదల చేస్తున్నందున పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఏప్రిల్ 11వ తేదీ తర్వాత ఆధునికీకరణలో భాగంగా కాల్వల లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సహాయ ఉపకరణాలకు 139 మంది ఎంపిక

ఖమ్మంవన్‌టౌన్: అలింకో సంస్థ ద్వారా దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు సోమవారం నిర్వహించిన శిబిరంలో 139 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి కీసర రాంగోపాల్ రెడ్డి తెలిపారు. ఖమ్మం రోటరీ క్లబ్‌లో నిర్వహించిన శిబిరానికి సుమారు 300మంది హాజరుకాగా, అందులో అర్హత కలిగిన వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఏడీఐపీ పథకం కింద అర్హులైన వారికి, రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం కింద 16మంది సీనియర్ సిటిజన్లకు సహాయ ఉపకరణాలను అందిస్తామని తెలిపారు.

స్థల సమస్య లేని ప్రాంతంలో వేగంగా పనులు

ఖమ్మంఅర్బన్: మున్నేటి వరద ముంపు నుంచి రక్షణ కోసం నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్ పనుల్లో వేగం పెంచాలని, స్థల సమస్య లేని ప్రాంతాల్లో త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం పనులను పరిశీలించి జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా భూసేకరణపై చర్చించిన ఆయన కలెక్టర్, మంత్రులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతానికి సమస్యలు లేని ప్రాంతాల్లో వేగంగా పనులు సాగించాలని సూచించారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్ పాల్గొన్నారు.

మంచీచెడు తెలుసుకుంటేనే బంగారు భవిష్యత్



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ శర్మ, తదితరులు

ఖమ్మంఅర్బన్: కౌమారదశలో ఉన్న విద్యార్థినులు మంచీచెడు తెలుసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం ద్వారా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాల దశలోని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మాత్రమే వ్యక్తిగత సమస్యలు చెప్పుకుని సూచనలు పొందాలే తప్ప పరాయి వ్యక్తులకు ఆశ్రయించొద్దని తెలిపారు. అలాగే, విద్యార్థినులు తమ ఒంటిని తాకే పరాయి వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు కూడా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 84 పాఠశాలల నుండి 148 మంది విద్యార్థులు హాజరుకాగా వివిధ అంశాలపై చైతన్యం కల్పించడంతో పాటు పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తదితరులు మాట్లాడగా పోటీల్లో విజేతలుగా నిలిచిన సబియా బేగం, మేఘన తదితరులకు బహుమతులు అందించారు.

ఓటర్లపై అభ్యంతరం.. పరిశీలనలో ఉద్రిక్తత



తహసీల్ వద్ద వివరాలు సేకరిస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: ఓటర్ల జాబితాకు సంబంధించి వెల్లడైన అభ్యంతరాలపై చేపట్టిన విచారణ ఉద్రిక్తతకు దారి తీసింది. మండలంలోని ముజ్జుగూడెంలో పలువురు స్థానికంగా ఉండనందున 167మంది పేర్లు తొలగించాలని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు కొందరేసి వ్యక్తుల పేర్లతో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం 141 మందిని జె.మాణిక్‌రావు విచారణకు పిలవగా ఇరువర్గాలకు చెందిన నాయకులు సైతం హాజరయ్యారు. ఒక్కొక్కరి గుర్తింపు కార్డులు పరిశీలిస్తూ ఎక్కడ ఉంటున్నారు, తాత్కాలికంగా ఉండే చోట ఓటు హక్కు ఉందా అని ఆరా తీసే క్రమాన ఇరువర్గాల వారి ఆరోపణలు, ప్రత్యారోపణలతో గందరగోళం నెలకొంది. దీంతో తహసీల్దార్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అలాగే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి కూడా వచ్చి పలువురి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'ప్రజావాణి'కి గైర్హాజరైతే నోటీసులు

- అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సమస్యలు వివరిస్తున్న రాకాసితండా వాసులు

ఖమ్మంసహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌ఓ ఏ.పద్మజ, డీఆర్‌డీఓ సన్యాసయ్యతో కలిసి దరఖాస్తులు స్వీకరించాక అధికారులతో సమావేశమయ్యారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అనుమతి లేకుండా గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల అనుమతి లేకుండా అధికారులు జిల్లా కేంద్రం విడిచి వెళ్లొద్దని, శాఖాపరమైన సమావేశాలకు వెళ్తే ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే, కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో లేకపోతే సీనియర్ ఉద్యోగిని కేటాయించాలని తెలిపారు.

- గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదతో తీవ్రంగా నష్టపోయిన తిరుమలాయపాలెం మండలం రాకాసితండా ప్రజలు ప్రజావాణిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిశారు. వరద ఉధృతితో ఇళ్లు కోల్పోయిన తమకు ప్రభుత్వం తరఫున కట్టించాలని, పశువులకు సైతం పరిహారం ఇప్పించాలని కోరారు. కాగా, కేశవాపురం గ్రామ పంచాయతీలో తమకు స్థల కేటాయింపుపై కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ బానోతు రవితో పాటు గుగులోత్ మోహన్, దేశ్యా, అజ్మీరా మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, పోడు పట్టాల కోసం పలువురు వినతిపత్రాలు అందజేశారు.
- దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రజావాణిలో పలువురు దివ్యాంగులు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని ఆటో స్టాండ్‌ను ఒకే సంఘానికి కాకుండా అన్ని రంగాలకు అవకాశం వచ్చేలా చూడాలని కోరగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ శక్తి ద్వారా టీ స్టాళ్లను మహిళా దివ్యాంగులకు కేటాయిస్తామని, ఇందిరమ్మ ఇళ్లలోనూ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.
- **ఖమ్మంఅర్బన్:** ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను ప్రజలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి పార్క్‌ను పరిశీలించిన ఆయన మెయిన్ రోడ్డు నుంచి జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. మెయిన్ రోడ్డు వద్ద ఆర్చి, ఆవరణలో సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మించి, పార్క్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రధాన కూడళ్లలో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. అనంతరం అటవీ బీట్ ఉద్యోగులకు కలెక్టర్ యూనిఫామ్, షూ అందజేశారు. ఎఫ్‌ఆర్‌ఓ జి.నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఏఈ అనిత పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా యూరియా విక్రయాలు

ఖమ్మంవ్యవసాయం: వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా యూరియా విక్రయాలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్య సూచించారు. ఎరువుల సరఫరా, విక్రయాలపై సోమవారం ఆయన వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు, వివిధ కంపెనీల డీలర్లతో సమీక్షించారు. యాసంగి అవసరాలకు 65 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు 58,056 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని తెలిపారు. సొసైటీల్లో విక్రయాల ఆధారంగా యూరియా కేటాయిస్తున్నామని, ప్రతీ డీలర్ ఎలక్ట్రానిక్ పీఓఎస్(పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ల ద్వారానే లావాదేవీలు నిర్వహించాలని చెప్పారు. పందిళ్లపల్లి రేక్ పాయింట్ మొదలయ్యే వరకు వరంగల్, మిర్యాలగూడ రేక్ పాయింట్ల నుంచి జిల్లాకు యూరియా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో 15 వేల మెట్రిక్ టన్నులకు గాను 6,900 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని డీఏఓ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏడీఏ పి.వాసవీరాణి, ఏఓ ఎస్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయాలు ఎదురుకావొద్దని..

- ముందస్తుగా తాగునీటి వనరుల పరిశీలన
- 363 బోర్లు, 297 మోటార్లు పాడైనట్లు గుర్తింపు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు చర్యలు

ఖమ్మంవన్‌టౌన్: రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా ప్రజలకు అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా మిషన్ భగీరథ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1నుండి 10వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సీఈ, ఎస్‌ఈ, ఈఈ, డీఈలు, డీఈఈలు పరిశీలించి గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించారు. ఎక్కడైనా మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతింటే అత్యవసరంగా ప్రత్యామ్నాయ సరఫరా చేయడానికి అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించారు. అంతేకాక చేతి బోర్లను స్థితిగతుల వివరాలు కూడా సేకరించారు.



చేతి బోర్‌ను పరిశీలిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

నివేదిక సిద్ధం

జిల్లాలోని 931 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అలాగే, గ్రామాల్లో 8,502 చేతిపంపులు ఉన్నాయి. ఈనేపథ్యాన అధికారులు 1నుండి 10వ తేదీ వరకు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో 363 బోర్లు పాడయ్యాయని గుర్తించారు. అలాగే, 280 సింగిల్ ఫేస్ మోటార్లు, 17 మోటార్లకు కూడా మరమ్మతు చేయించాలనే అంచనాకు వచ్చారు. అంతేకాక 1,440 పీడబ్ల్యూఎస్ఎస్ స్కీమ్‌లకు గాను 38 స్కీమ్‌లకు మరమ్మతు అవసరమని నివేదిక సిద్ధం చేశారు. ఇవికాక 270 ఓపెన్ బావుల వద్ద కూడా అవసరమైన మరమ్మతులను మార్చి 15నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించారు.

మరమ్మతులు పూర్తిచేస్తాం..



జిల్లాలోని అన్ని గ్రామాలకు అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేలా సిద్ధమవుతున్నాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వే ద్వారా ఎక్కడెక్కడ బోర్లు, మోటార్లకు మరమ్మతులు అవసరమో గుర్తించాం. ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి మార్చి 15నాటికి పూర్తిచేస్తాం

– పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతకు రశీదు ఇస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి 7వ లైన్‌లో నిర్మిస్తున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి దమ్మపేట మండలం గట్టుగూడెంకు చెందిన దాతలు రూ.1.11లక్షల విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన విశ్వనాధరావు, లలితాదేవి జ్ఞాపకార్థం కోటగిరి నర్సింహారావు, సత్యవతి దంపతులు సోమవారం ఈ నగదును అందజేశారు. ఆలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

వేలంలో రూ.2.70లక్షలు పెరిగిన ఆదాయం

మధిర: మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జాతర సమీపాన జాయింట్ వీల్ ఏర్పాటుకు వేలం నిర్వహించగా మధిర హనుమాన్ కాలనీకి చెందిన మొగిలి నరసింహారావు రూ.23.70 లక్షలకు దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.21లక్షలు పలకగా ఈసారి మరో రూ.2.70లక్షలు పెరిగింది. మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ఉద్యోగి రాధ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంరక్షణ అందరి బాధ్యత

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి చంద్రశేఖర్రావు.

ఖమ్మం లీగల్: శారీరక, మానసిక దివ్యాంగుల సంరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఖమ్మంలోని న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు సోమవారం ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణ, చికిత్స, పునరావాసం కల్పించడాన్ని మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టంలో చేర్చారని తెలిపారు. ఈ చట్టం అమలుకు ప్రభుత్వం మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్, మానసిక ఆరోగ్య అథారిటీలు ఏర్పాటుచేసినందున అందరూ సహకరించాలని సూచించారు. అనంతరం చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతరావు, న్యాయవాదులు పోలిశెట్టి పద్మావతి, ఇమ్మడి లక్ష్మీనారాయణ, కె.రామలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు. పారా లీగల్ వలంటీర్లు నాగమణి, కోమలత, నాగేంద్ర, అన్నపూర్ణ, జయ సుజాత, సరిత, సునీత, సూపరింటెంట్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు తెలిపారు. ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కార్మిక సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా రూ.56 వేల కోట్లు కేటాయించిన కేంద్రం అందులో రూ. 20,436 కోట్లే విడుదల చేసిందన్నారు. ఈసారి రూ.49వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు రావి శివరామకృష్ణ, సీహెచ్.సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, ఎం.డీ.జాకీరుద్దీన్, వేము రాంబాబు, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఖమ్మంఅర్బన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఎనిమిది మంది వాహనదారులకు రెండు రోజులు జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వై.బిందుప్రియ సోమవారం తీర్పు వెల్లడించారు. ఇటీవల పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ అనంతరం కోర్టులో హాజరుపర్చగా తీర్పు చెప్పారని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,150	2,150
పెసలు	7,000	7,000
మినుములు	7,350	7,350
అలసంద	7,100	5,100
మిర్చి	14,000	6,000
మిర్చి తాలు	7,000	5,000
ఏసీ మిర్చి	13.200	6,000
పత్తి	7,100	5,100

– ఖమ్మం వ్యవసాయం

ఆమే అధికం!



- ప్రాదేశిక ఎన్నికలకు ఓటర్ల జాబితా విడుదల
- మొత్తం ఓటర్లు 8,22,528 మంది

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల ముసాయిదా జాబితా సిద్ధమైంది. ఈ జాబితాను జెడ్పీ సీఈఓ దీక్షారైనా సోమవారం విడుదల చేశారు. అనంతరం జాబితాను గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలో 20 జెడ్పీటీసీ, 287 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కాగా, ముసాయిదా ఓటరు ప్రకారం జిల్లాలో మొత్తం 8,22,528మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 3,97,766 మంది, 4,24,739 మంది మహిళలు ఉన్నారు. మొత్తంగా ఓటర్లలో మహిళలు 26,973 మంది ఎక్కువగా ఉండడం విశేషం. ఈ జాబితా ఆధారంగానే ఎన్నికలు జరగనున్నాయి. కాగా, జిల్లాలో ఓటర్లలో 23 మంది ఇతరులు ఉన్నారు. రఘునాథపాలెం మండలంలో ఆరుగురు, కారేపల్లి మండలంలో నలుగురు, ఖమ్మం రూరల్, మధిర, ముదిగొండ ఇద్దరేసి చొప్పున, బోనకల్, ఏన్కూరు, కూసుమంచి, నేలకొండపల్లి, సత్తుపల్లి, తల్లాడ, ఎర్రుపాలెం మండలాల్లో ఒకరు చొప్పున 'ఇతర' ఓటర్లు ఉండగా మిగతా మండలాల్లో ఎవరూ నమోదు కాలేదు. అలాగే, మండలాల వారీగా పరిశీలిస్తే మొత్తంగా కల్లూరు మండలంలో అత్యధికంగా, వైరా మండలంలో తక్కువగా ఓటర్లు ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కల్లూరు	26,567	28,032	0	54,599
టీ.పాలెం	24,493	26,230	0	50,723
కూసుమంచి	24,321	26,035	1	50,357
నేలకొండపల్లి	23,952	26,150	1	50,103
ముదిగొండ	23,368	25,387	2	48,757
తల్లాడ	22,603	23,774	1	46,378
కారేపల్లి	22,301	23,368	4	45,673
పెనుబల్లి	21,446	22,665	0	44,111
కొణిజర్ల	20,378	21,541	0	41,919
చింతకాని	19,979	21,694	0	41,673
రఘునాథపాలెం	19,555	21,544	6	41,105
ఎర్రుపాలెం	19,658	20,803	1	40,462
వేంసూరు	18,225	18,953	0	37,178
బోనకల్	17,663	18,785	1	36,449
సత్తుపల్లి	17,487	18,750	1	36,238
కామేపల్లి	17,442	18,117	0	35,559
ఖమ్మం రూరల్	16,357	17,732	2	34,091
మధిర	15,306	16,409	2	31,717
ఏన్కూరు	13,462	14,639	1	28,102
వైరా	13,203	14,131	0	27,334
మొత్తం	3,97,766	4,24,739	23	8,22,528

ఎమ్మెల్సీ ఓటర్లు 4,089 మంది

- ఓటర్లలో పురుషులే అధికం
- బోనకల్, తిరుమలాయపాలెం మండలాల్లో తక్కువ



ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల లెక్క తేలింది. గత ఏడాది డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ప్రకటించే నాటికి 3,955 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, మరోమారు గత నెల 31 వరకు ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈమేరకు అందిన దరఖాస్తులను పరిశీలించి సప్లిమెంటరీ జాబితాను సోమవారం విడుదల చేశారు. ఈమేరకు జిల్లాలో 4,089 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 2,372 మంది, మహిళలు 1,717 మంది ఉన్నారు. డిసెంబర్ జాబితా కన్నా ఇప్పుడు 134 మంది ఓటర్లు పెరిగారు. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో, అత్యల్పంగా బోనకల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఓటర్లు ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
ఖమ్మం అర్బన్	1.042	944	1.986
ఖమ్మం రూరల్	309	179	488
సత్తుపల్లి	168	109	277
మధిర	121	82	203
సింగరేణి	98	79	177
వైరా	66	47	113
కల్లూరు	63	31	94
కామేపల్లి	65	20	85
ఏన్కూర్	52	23	75
కొణిజర్ల	46	20	66
కూసుమంచి	40	26	66
వేంసూరు	50	15	65
పెనుబల్లి	41	22	63
ఎర్రుపాలెం	33	26	59
నేలకొండపల్లి	37	18	55
రఘునాథపాలెం	26	15	41
తల్లాడ	24	13	37
చింతకాని	30	06	36
ముదిగొండ	22	13	35
బోనకల్	16	18	34
తిరుమలాయపాలెం	23	11	34
మొత్తం	2,372	1,717	4,089

జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

ఖమ్మంసహకారనగర్: ఫిజికల్‌సైన్స్ ఫోరం ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని సైన్స్ మ్యూజియంలో జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి సాయిగౌతమ్(జీహెచ్ఎస్, ఈవీఎం మధిర), నంద్రు మణికుమార్(జెడ్పీహెచ్ఎస్, మీనవోలు), ఎస్.కే.సిరాజ్(టీవీఎం, జీహెచ్ఎస్, మధిర), రెండో బహుమతి ఎస్.కే.ఆసిఫ్(జెడ్పీహెచ్ఎస్, పినపాక), వి.నరేష్(జెడ్పీహెచ్ఎస్, తట్టిలపాడు), మూడో బహుమతి పి.వెన్నెల(జెడ్పీహెచ్ఎస్, జలగం నగర్), బి.సాయికిరణ్(జెడ్పీహెచ్ఎస్, తిరుమలాయపాలెం), వి.నందిని (కేజీబీవీ, బోనకల్)గెలుచుకున్నారు. విజేతలకు ఖమ్మం ఎంఈఓ శైలజలక్ష్మి, ఫోరమ్ బాధ్యులు జ్ఞాపికలు అందజేశారు. డీసీఈబీ సెక్రటరీ నారాయణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ దుస్సా జగదీశ్వర్, ఫోరం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌తో పాటు ఆదిత్యకుమార్, యు.శ్రీనివాస్, రవికుమార్, కె.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ/ఎర్రుపాలెం: జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతి సాధించిన ఎర్రుపాలెం మండలం మీనవోలు జెడ్పీహెచ్ఎస్ మణికుమార్, రెండో బహుమతి సాధించిన తల్లాడ మండలం పినపాక జెడ్పీఎస్ఎస్ విద్యార్థి ఆసిఫ్‌ను ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఫోరం బాధ్యులు

ఎక్సైజ్ ఉద్యోగులను అభినందించిన డైరెక్టర్

ఖమ్మంక్రైం: ఖమ్మంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడమే కాక వారికి శిక్ష పడేలా చార్జీషీట్ దాఖలు చేసిన ఎక్సైజ్ అధికారులను రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో సోమవారం వారిని అభినందించిన ఆయన రివార్డులు అందజేశారు. ఇందులో డీటీఎఫ్ వేణుగోపాల్‌రెడ్డి, అప్పటి ఎక్సైజ్ సీఐలు రాజు(ప్రసుత్తం వరంగల్), సీఐ సర్వేశ్వరరావు(ప్రస్తుతం జగిత్యాల ఎక్సైజ్ సీఐ), ఎస్ఐ వి.రవి, కోర్టు కానిస్టేబుల్ మారేశ్వరరావు ఉన్నారు. ఈసందర్భంగా వీరిని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి అభినందించారు.



ఈడీ కమలాసన్‌రెడ్డితో ఎక్సైజ్ ఉద్యోగులు

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.ఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వం జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ , విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా బకాయిలు విడుదల చేయడమే కాక జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు మంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. అలాగే, రానున్న బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మందా సురేష్, నాయకులు సీ.హెచ్.అజయ్, శ్యామల, కైఫ్, ఇందు, ప్రేమ్‌కుమార్, మౌనిక, దీపిక, సంస్కృతి, శిరీష, రాము, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

సైలో బంకర్ తొలగించాలని రిలే దీక్షలు

సత్తుపల్లిరూరల్: సింగరేణి సంస్థ సత్తుపల్లి ఓసీల నుంచి రైలుమార్గం ద్వారా బొగ్గు తరలింపునకు నిర్మించిన సైలో బంకర్‌తో తాము ఇబ్బంది పడుతున్నామని కిష్టారం అంబేద్కర్ నగర్ వాసులు పేర్కొన్నారు. ఈ మేరకు బంకర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికలు మాట్లాడుతూ బంకర్ కారణంగా వెలువడుతున్న బొగ్గు దుమ్ముధూళితో శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నామని, ఇప్పటికే పలువురు మృతి చెందారని వాపోయారు. ఈమేరకు కాలుష్యం నుంచి తమను కాపాడేలా బంకర్‌ను తొలగించాలని, లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.



దీక్ష శిబిరంలో అంబేద్కర్ నగర్ వాసులు

కాగా, సింగరేణి పీఓలు నర్సింహారావు, ప్రహ్లాద్ దీక్ష శిబిరానికి వచ్చి స్థానికులతో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజుతో ఫోన్‌లో మాట్లాడించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పగా, స్పష్టమైన హామీ రాకపోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి కొద్దిసేపు ధర్నా చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చింతకాని: మండలంలోని కోమట్లగూడెం సమీపాన ఓ మామిడితోటలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో చింతకాని ఎస్సై నాగుల్ మీరా సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా అక్కడ పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి రూ.9 వేల నగదు, 13 ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడి పందేల నిర్వాహకుల్లో కొందరు పరారయ్యారని వెల్లడించారు.

ట్రాక్టర్ పైనుంచి ఎగిరిపడి డ్రైవర్ మృతి

ఎర్రుపాలెం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిన డ్రైవర్ మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి వేముల లక్ష్మయ్య(45) సోమవారం ట్రాక్టర్ నడుపుతూ ఎర్రుపాలెం నుండి మధిర వైపు వెళ్తున్నాడు. మీనవోలు సమీపానికి రాగానే రోడ్డు పక్కనే ఉన్న మట్టి కుప్పపైకి ట్రాక్టర్ ఎక్కగా అదుపు తప్పడంతో లక్ష్మయ్య ఎగిరి కింద పడ్డాడు. ఈక్రమాన ఆయన ట్రాక్టర్ ట్రాలీ టైర్ కిందపడడంతో అది ముందుకు వెళ్తుండడంతో తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు.

ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు
- నానమ్మ ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యాతండాలో అమానుషం జరిగింది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెకు కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించగా వారు ఇప్పుడు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పిల్లల నానమ్మ ఫిర్యాదుతో సోమవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జోగ్యాతండాకు చెందిన ఆటోడ్రైవర్ వాంకుడోత్ వెంకటేష్‌కు ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన ఉషతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి వరుణ్‌తేజ్, నిత్యశ్రీ పిల్లలు ఉండగా వెంకటేష్ అనారోగ్యంతో నాలుగు నెలల క్రితం చనిపోయాడు. ప్రస్తుతం ఉష తన పిల్లలతో కలిసి, వెంకటేష్ తల్లిదండ్రులు వాంకుడోత్ శ్రీను – బుజ్జి ఇంట్లోని ఓ గదిలో ఉంటోంది. ఈనెల 5న ఉష బయటకు వెళ్లిన సమయంలో వరుణ్‌తేజ్, నిత్యశ్రీ వాంతులు చేసుకుంటుండడంతో బుజ్జి ఆరా తీయగా తల్లి కూల్‌డ్రింక్ తాగించిందని తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా వారి శరీరాల్లో పురుగు మందు ఆనవాళ్లు ఉన్నాయంటూ వైద్యులు చెప్పడంతో ఉషను నిలదీస్తే కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించినట్లు ఒప్పుకుంది. అంతలోనే పిల్లల పరిస్థితి విషమించగా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నిత్యశ్రీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఘటనపై పిల్లల నానమ్మ బుజ్జి సోమవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉష ప్రవర్తనపై అనుమానాలు ఉన్నాయని, ఆమె స్వేచ్ఛకు పిల్లలు అడ్డుగా ఉన్నారనే గడ్డి మందు తాగించి ఉంటుందని చెప్పింది. తమ కుమారుడు వెంకటేష్ మృతిపైనా అనుమానాలు ఉన్నాయని వెల్లడించింది.

తల్లి ఆత్మహత్యాయత్నం

పిల్లలకు గడ్డి మందు తాగించిన బయటపడడంతో మూడు రోజుల క్రితం ఉష ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెకు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయించగా కోలుకుని సోమవారం నీలోఫర్ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిసింది.

గుర్తుతెలియని యాచకుడు...

ఖమ్మంక్రైం: ఖమ్మం శ్రీనివాస టాకీస్ సమీపంలోని ఓ షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. ఆయన వద్ద ఎలాంటి లభించకపోవడంతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసుల సూచనతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా

డ్రైవర్ సహా నలుగురికి గాయాలు

కారేపల్లి: స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడగా డ్రైవర్‌తో పాటు ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాణిక్యారం గుడితండా గ్రామానికి చెందిన 12మంది విద్యార్థులు కారేపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు మేకలతండా వాసి ఆకాశ్ ఆటోలో వెళ్లివస్తారు. అందులో భాగంగానే సోమవారం సాయంత్రం పాఠశాల వదిలాక ఆటోలో విద్యార్థులను తీసుకెళ్తున్నాడు. మరో ఐదు నిమిషాల్లో గ్రామానికి చేరుకుంటారనగా ఎర్రబోడు ముత్యాలమ్మగుడి సమీపాన ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటనలో ఆటోడ్రైవర్ ఆకాశ్‌తో పాటు, విద్యార్థులు యువన్‌సింగ్ నాయక్, వైష్ణవి, విగ్నేష్‌కు తీవ్రగాయాలు కాగా, మిగతా విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీంత స్థానికులు వారిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.



అదుపుతప్పి ఆటో బోల్తాపడిన దృశ్యం

ఘటనాస్థలానికి కారేపల్లి ఎస్ఐ ఎస్.రాజారాం చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఆటోడ్రైవర్‌కు రెండుపక్కలా ఇద్దరేసి విద్యార్థులను కూర్చోబెట్టడంతో హ్యాండిల్ సరిగ్గా తిప్పరాకపోవడంతో ప్రమాదం జరిగి ఉంటుంని స్థానికులు చెబుతున్నారు.

మనస్తాపంతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ముదిగొండ: మండంలోని మేడేపల్లికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ అబ్దుల్ రెహమాన్(28) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఫైనాన్స్ చెల్లించడం కోసం తల్లి హుస్సేన్‌బీ పనిచేసే గడల పుల్లయ్య వద్ద రెండేళ్ల క్రితం రూ.50వేల అప్పు ఇప్పించింది. కాగా, పుల్లయ్య తనను నగదు అడిగాడని ఆదివారం ఆయనకు తల్లి చెప్పింది. ఈక్రమంలో పుల్లయ్య దూషించాడనే మనస్తాపంతో రెహమాన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తండ్రి సలీం ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు.